క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ: వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ ప్రయోగ మూర్తి స్పష్టం చేశారు. పాలకొండ-సీతంపేట రహదారిలో మంగళవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా పెండింగ్ పెనాల్టీలు వసూలుతో పాటు నెంబర్ ప్లేటు బోర్డులు లేని వాహనపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ఉన్నత న్యాయస్థానాల సూచనలతో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినంగా అమలు చేయడంతో పాటు భారీగా జరిమానాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్‌లను వాహనచోదకులు కలిగి ఉండాలన్నారు.

6 నుంచి సంతోషిమాత ఉత్సవాలు



సంతోషి మాత మూలవిరాట్

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు మాతగా పూజలందుకొంటున్న బత్తిలి సంతోషిమాత ఆలయ ప్రతిష్ఠ 39వ వార్షికోత్సవాలను ఈ నెల 6 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. ఆలయ ప్రధాన అర్చకులు రంపా తాతబాబు శర్మయాధ్వర్యంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300



రావివలసలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని రావివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ బారినపడకుండా ఉండేందుకు ఉదయం, సాయంత్రం వాతావరణం చల్లగా ఉన్న వేళల్లో పని చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీవో గౌరీనాథ్ తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత



జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

జియ్యమ్మవలస: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు ఆశ కార్యకర్తలంతా కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మార్చి 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామని, సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో జానకి, సింహాద్రమ్మ, సుశీల, మంజు, కమల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆర్‌డబ్ల్యూఎస్ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ మంగళవారం పరిశీలించారు. పీఎం జన్‌మన్ పనులను వేగవంతం చేయాలని, ఇచ్చిన లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఏగులవాడ అంగన్‌వాడీ కేంద్రం, గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన సందర్శించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందివ్వాలని తెలిపారు.

● పక్కాగా హౌస్ హోల్డ్ సర్వే



హౌస్‌హోల్డ్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.గీతాంజలి సూచించారు. మండలంలోని కుసుమూరు, టిటుకుపాయి, టిటుకుపాయిగూడ పరిధిలో మరణించిన వ్యక్తుల వివరాలను మంగళవారం పునఃపరిశీలన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో రోడ్లు, దోనుబాయి పీహెచ్‌సీ ప్రహరీ పనులు పరిశీలించారు. ఉపాధి పథకంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల వర్క్‌ఫ్రం హోం సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. –సీతంపేట

● అందరి సహకారంతోనే భూసర్వే



ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు కోరారు. భామిని మండలం ఘనసరలో సర్పంచ్ కిల్లారి కమల అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రైతుల సమావేశంలో శాశ్వత భూసర్వేలో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. లోహరిజోలలో డీటీ శంకరరాయుడు, మండల సర్వేయర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. –భామిని

● వాహన తనిఖీలు



మండలంలోని చింతల బెలగాం రహదారిలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి వారి లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలపై వెళ్లవద్దని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని తెలిపారు. –జియ్యమ్మవలసరూరల్

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయండి

● కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సర్వేపై సూచనలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే సక్రమంగా చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని దళాయివలస గ్రామంలో చేపడుతున్న భూముల రీసర్వేను ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. భూములు కొలతలు వేసేముందు రైతులకు ఫారం-19 నోటీసులు ఇస్తున్నదీ లేనిదీ, అడంగల్‌లో రైతుల పేరిట ఉన్న భూమి విస్తీర్ణం కచ్చితంగా కొలతలు వేస్తున్నారా లేదా అనే విషయాలపై ఆరాతీశారు. గ్రామంలో మొత్తం 676 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా, ఇంతవరకు 573 ఎకరాల్లో సర్వే చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. రోవర్ సహాయంతో కచ్చితమైన భూ సరిహద్దులు నిర్ణయించి, రైతులకు భూమి అప్పగించాలన్నారు. సర్వేలో ఎలాంటి లోపాలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వేను నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామకంతం భూమిని గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల ఆక్రమణలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు టి.బాల, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వో వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కజొన్నతో లాభాలు



మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు వివరిస్తున్న ఏఓ

భామిని: పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారించాలని, దీంతో కూడా మంచి లాభాలు వస్తాయని ఏఓ కె.సింహాచలం అన్నారు. చిన్నదిమిలి, ఘనసరలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించి సూచనలు చేశారు. రబీ మొక్కజొన్నలో నత్రజని 80 ఉంచి 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు కలిపి వేయాలని సూచించారు. తేలికపాటి నేలల్లో ఎకరానికి 200 గ్రాములు, బరువు నేలలకు 1200 గ్రాముల అట్రాజిన్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి చల్లితే కలుపు సమస్య ఉండదన్నారు. మొక్కజొన్న మధ్యలో చాళ్ల మధ్య వేరుశనగ, పెసర, మినుము, బొబ్బర్లు వేసుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. వ్యవసాయ సహాయకులు గొర్లె ఎలీసా, సందీప్, రైతులు పాల్గొన్నారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించండి



ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గరుగుబిల్లి: కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణను ఆయన పరిశీలించి, కాసేపు మాట్లాడారు. వైద్యారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా కిశోరి బాలికలు, బాలింతలు రక్తహీనత బారినపడకుండా చూడాలని, ప్రతిరోజూ వారు పౌష్టికాహారం తీసుకునేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అలాగే బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. గర్భిణుల నమోదు త్వరితగతిన చేపట్టాలని, వారికి సకాలంలో వైద్య తనిఖీలు జరిగేలా చూడాలన్నారు. ఎన్‌సీడీ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చిన్నమ్మి, ఈవో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకును తరలించొద్దు

గరుగుబిల్లి: తోటపల్లిలో ఏర్పాటు చేసిన ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్)ని తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అధికారులు విరమించుకోవాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు అధికారుల అభ్యర్థన మేరకు రూ.12 లక్షల విరాళాలను సేకరించి తోటపల్లి ఆలయం ఆధ్వర్యంలో బ్యాంకు కార్యాలయ నిమిత్తం భవనాన్ని నిర్మించి 2011లో బ్యాంకుకు అప్పగించడం జరిగిందన్నారు. గత 14 ఏళ్ల నుంచి అదే భవనంలో బ్యాంకు కార్యాకలాపాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అయితే దేవదాయ శాఖ అధికారులు బ్యాంకుకు ఎలాంటి మరమ్మతులు నిర్వహించకుండా కనీసం పెయింట్లు కూడా వేయకుండా నిర్లక్ష్యం చేసి బ్యాంకు సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. 14 ఏళ్లుగా బ్యాంకు అధికారులు భవనానికి సంబంధించిన అద్దెను కూడా తీసుకోకుండా బ్యాంకు ఖాతాలోనే ఉంచారన్నారు. ఈ విషయాన్ని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్‌కు కూడా వివరించడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా, బ్యాంకును ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి తరలించేందుకు సిబ్బంది నిర్ణయం తీసుకున్నారని బయట వదంతులు వస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు తెలుసుకున్న పిమ్మట మంగళవారం తోటపల్లి గ్రామం నుంచి బ్యాంకును తరలించవద్దని గ్రామంలోని పలువురు మహిళలు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారన్నారు.

ఎంపీడీవో పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తుంబలి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఎస్.రమేష్ మంగళవారం సందర్శించారు. అక్కడి రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామస్తులకు అవసరమైన పౌరసేవలు సకాలంలో అందివ్వాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం అక్కడి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, చిన్నారులకు అందిస్తున్న ఆటపాటలతో కూడిన విద్య, రికార్డులు తనిఖీ చేశారు.

రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

జియ్యమ్మవలస రూరల్: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీఎస్ పద్మావతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆమె.. అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వారికి సకాలంలో సక్రమంగా సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఐరన్ లోపంతో బాధపడుతున్న చిన్నారులు, బాలింతలు, గర్భిణులను గుర్తించి, వారి ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పి.జగదీష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్థితిగతులపై విశ్లేషణ



కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళల ఆర్థిక స్థితిగతులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి ఆధ్వర్యంలో మహిళా విద్యార్థులచే పాలకొండ ఇంద్రానగర్ కాలనీలో నివసిస్తున్న కుటుంబాలలోని మహిళల వయస్సు, విద్య, ఆరోగ్య పరిస్థితుల, ఆర్థిక పరిస్థితులపై విశ్లేషాత్మక సమాచారం సేకరణ నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పార్వతీపురం రూరల్: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పార్వతీపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ యు. నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్వతీపురం మండలంలో సి-కే టగిరికి చెందిన అడారు గ్రామంలో సారా నిర్మూలనపై గ్రామ యువతకు అవగాహన కల్పించారు.

క్రాస్‌ప్రోగ్రాం వాహన సేవలు ప్రారంభం



గరుగుబిల్లి: వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో పైడితల్లి



జియ్యమ్మవలస రూరల్: క్రాస్‌ప్రోగ్రాం వాహన సేవలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహన సేవలను ఎంపీడీవో ఎస్.రమేష్ మంగళవారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 31 పంచాయతీలకు సంబంధించి, అన్ని గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా తాగునీటి బోర్లు బాగాలేకపోతే సమాచారం ఇవ్వాలన్నారు. రానున్న వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ఎంపీడీవో జి.పైడితల్లి ప్రారంభించారు. రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని ఆమె తెలిపారు. ఏప్రిల్ ఐదో తేదీ వరకు తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, జేఈ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు. మార్చి 4న సాంబన్నవలస, గొల్లవానివలస, 5న గరుగుబిల్లి, 6న హిక్కింవలస, 7న శివ్వాం, సీమలవానివలస, 8న పెద్దూరు, 10న బీవీ పురం, 11న గొట్టివలస, 12, 13న రావుపల్లి, 14న కొత్తూరు, 15న కొత్తపల్లి, 17న ఉల్లిబద్ర, 18న లఖనాపురం, 19న కొంకడివరం, 20న సంతోషపురం, 21న వల్లరగుడబ, 22న సుంకి, 24న చినగుడబ, 25, 26న రావివలస, 27న దళాయివలస, 28న నాగూరు, 29న చిలకాం, దత్తివలస, కారివలస, ఏప్రియల్ 1న పెదగుడబ, ఎస్ఆర్ పేట, 2న గిజబ, 3న తోటపల్లి, 5న ఆర్‌డీవలస గ్రామాల్లో క్రాస్‌ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు.

‘పొలం పిలుస్తోంది’



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నిర్మలజ్యోతి

కొమరాడ: మండలంలోని నందాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులంతా గ్రామంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నిమ్మగడ్డి పండించే రైతులకు క్లస్టర్ విధానంలో వంపు సెట్లు ఇస్తామన్నారు. అలాగే నూనే తీసే యంత్రాలను కూడా రాయితీపై అందిస్తామన్నారు. ఈ ఏడాది జీడిమామిడి పంటను వెలుగు సంఘాల ద్వారా కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శంకరరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

జియ్యమ్మవలస రూరల్: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రావాడ రామభద్రపురంలో యోగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మెరుగైన ఆరోగ్యానికి పలు ఆసనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలంటే ఇష్టమైన రంగంలో రాణించేందుకు ప్రయత్నం చేయాలని ఆమె తెలిపారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న దళిత సంఘ జేఏసీ నాయకులు

పాలకొండ రూరల్: పోలీసు ఉన్నతాధికారి పీవీ సునీల్‌కుమార్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని పార్వతీపురం మన్యం జిల్లా దళిత సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం పాలకొండ డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో దళిత సంఘాల జేఏసీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు బత్తిన మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారులపై వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం దళిత, గిరిజన అధికారులపై ప్రతీకార చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వాలు మారిన సందర్భాలలో ప్రభుత్వ ఉద్యోగులను వేధింపులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పాలకొండ డివిజన్ సీనియర్ నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, ఎస్.భరత్‌భూషణ్, ఎం.ప్రసాదరావు, టి.ఉపేంద్ర, ఆర్.వెంకట్రావుతో పాటు పలువురు ఉన్నారు.

12న ‘చలో విజయవాడ’



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

జియ్యమ్మవలసరూరల్: వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 12వ తేదీన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. ఇదే విషయమై రూపొందించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వేతనదారులకు అదనంగా పనిదినాలు పెంచాలని, మేట్‌లకు రూ.5 అదనంగా ఇవ్వాలని, వేతనదారునికి రోజువారీ కూలి డబ్బులు రూ.600 వచ్చేలా చూడాలని, అలాగే నిరుపేదలకు 3 సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. దళిత కాలనీలకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బి.మోహన్‌రావు, గిరిజన సంఘం నాయకుడు కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

సీతానగరం: మండలంలోని దయానిధిపురంలో మాజీ సర్పంచ్ వై.రాధాకృష్ణ కుటుంబీకుల ఆధ్వర్యంలో పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు వాసు,కోటేశ్వరరావు పర్యవేక్షణలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, అంటిపేట సర్పంచ్, ఎంపీటీసీ ఎస్.తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వై.గోపాలనాయుడు, జానుమల్లువలస మాజీ సర్పంచ్ వై జగన్నాథం నాయుడు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com